
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 31.0 కనిష్ఠం : 20.0

ANDHRAJYOTHY

5



నాగర్‌కర్నూల్

జిల్లా వార్తలు

గురువారం 25 జనవరి 2024



కళాశాల వివరాలు తెలుసుకుంటున్న జేఎన్‌టీయూ బృందం

ఎండిన నదిలో.. పచ్చని పంటలు

నీరు తగ్గడంతో పాయలా మారిన కృష్ణానది



- కృష్ణానదిలో నీరు తగ్గాక సాగు చేస్తున్న రైతులు
- భూములు తేమగా ఉండటంతో అధిక దిగుబడులు
- నీటి తడులు అవసరం లేకుండానే సాగు



జటప్రోల్ శివారులో సాగు చేసిన పుచ్చకాయ తోట



పెంట్లవెల్లి మండలం వెంకల్ దగ్గర కృష్ణానదిలో ఏపుగా పెరిగిన జొన్న

పెంట్లవెల్లి, జనవరి24: నీరు లేక ఎండిన కృష్ణానదిలో రైతులు సిరుల పంటలు పండిస్తున్నారు. అధిక దిగుబడులు సాధించి ఆదర్శంగా నిలుస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా కృష్ణానదిలో నీటి ముంపునకు గురైన నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలం మంచాలకట్ట, మల్లేశ్వరం, జటప్రోల్, వెంకల్, మాధవస్వామినగర్ గ్రామాల్లోని 1,500 ఎకరాల్లో నదిలో నీరు లేనప్పుడు రైతులు వివిధ రకాల పంటలు వేస్తున్నారు. ఏటా జూన్, జూలై నెలల్లో కృష్ణానది నిండుగా పారుతుంది. నదిలో నీరు తగ్గాక పంటలు సాగు చేస్తారు. ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురవడం, నది నుంచి ఇటు తెలంగాణ.. అటు ఆంధ్రప్రదేశ్ నీటిని తరలించడంతో అక్టోబరు, నవంబరు నుంచే నదిలో నీరు తగ్గడం మొదలైంది. నీరు తగ్గడంతో నదిలో తేలిన పొలాలను రైతులు సాగు చేశారు. గతంలో ఉన్న భూముల హద్దులను సరి చేసుకుని, మరికొందరు కౌలుకు తీసుకుని పంటలు వేశారు. ఈ ఏడాది అక్టోబరు, నవంబరులో వేరుశనగ, పొద్దుతిరుగుడు, మినుములు, నువ్వులు, మొక్కజొన్న, శనగ వంటి వివిధ రకాల పంటలతో పాటు పుచ్చకాయ తోట పెట్టారు. భూములు దాదాపు ఆరు నెలల పాటు నీటిలో మునిగి ఉండడం వల్ల సారవంతంగా మారి, అధిక దిగుబడులు పొందుతున్నారు. పంటల్లో ఎలాంటి కలుపు మొక్కలు రావని రైతులు చెబుతున్నారు. అదేవిధంగా ఎలాంటి రసాయన ఎరువులు కూడా వేయబోమని అంటున్నారు. మంచాలకట్ట, జటప్రోల్, మాధవస్వామినగర్ గ్రామాలల్లో బంకమట్టి, నల్లరేగడి భూములు ఉండటంతో భూమిలో ఉండే తేమకే పంటలు పండుతాయి. వెంకల్, మల్లేశ్వరం గ్రామాల్లోని రైతులు మాత్రం నదిలోనే బోర్లు, పైపుల ద్వారా నది నీటిని పారబెట్టి పంటలు పండిస్తున్నారు. ఈ సంవత్సరం కృష్ణా నది పూర్తి స్థాయిలో నిండలేదు. దాంతో తొందరగా ఎండింది. ఈ నేపథ్యంలో ఏ పంటలైనా సాగు చేయొచ్చన్న ఉద్దేశంతో భూముల కౌలు ధర కూడా అధికంగా పలికింది. ఎకరం రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు ధర పలికింది.



మంచాలకట్టలో కోతకు వచ్చిన శగన పంట



కట్టలు కట్టిన నువ్వుల చేను



మల్లేశ్వరంలో సాగు చేస్తున్న నువ్వుల పంట

కోస్గికి ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల మంజూరు

- పరిశీలించిన జేఎన్‌టీయూ ప్రొఫెసర్ల బృందం
- రాష్ట్రంలోనే మొట్టమొదటి గవర్నమెంట్ కాలేజీ
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లు ప్రారంభించనున్నట్లు వెల్లడి

కోస్గి రూరల్ జనవరి 24: నారాయణపేట జిల్లా కోస్గి పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దాంతో రాష్ట్ర ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్లు బుధవారం కళాశాలను పరిశీలించారు. జేఎన్‌టీయూ ప్రొఫెసర్లు చంద్రమోహన్, ఉజ్వలరేఖ(కంప్యూటర్ సైన్స్), రజిని(ఈసీఈ హెడ్‌డిపార్ట్‌మెంట్) బృందం తనిఖీ చేసింది. కళాశాలలోని వసతులు, తరగతి గదులు, పరికరాలు, కంప్యూటర్ల గురించి ప్రిన్సిపాల్ పరమేశ్వరిని అడిగి తెలుసుకున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంజనీరింగ్ విభాగంలో అడ్మిషన్లు తీసుకుంటామన్నారు. అందుకు అనుగుణంగా వసతులను పరిశీలిస్తున్నామని వారు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రఘువర్ధన్‌రెడ్డి, విజయ్‌కుమార్, అన్న కిష్టప్ప, నాగులపల్లి నరేందర్ పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం

- నవాబ్‌పేట మండలం మల్లారెడ్డిపల్లిలో ఘటన

నవాబ్‌పేట, జనవరి 24: మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు అదృశ్యమైంది. ఇన్‌చార్జి ఎస్‌ఐ సురేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్లారెడ్డిపల్లికి చెందిన కొత్త పద్మమ్మ(60) ఈ నెల ఏడున ఉదయం పది గంటలకు ఇంటి నుంచి బయటికి వెళ్లింది. కొడుకు శ్రీనివాసులు బంధువుల ఇళ్ల వద్ద వెతికినా కనిపించ లేదు. దాంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్‌ఐ తెలిపారు.

అచ్చంపేటకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్

- రూ.25 కోట్లతో ఏర్పాటు
- స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ స్థలంపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అచ్చంపేట, జనవరి 24: నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ మంజూరైంది. రూ.25 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఈ సెంటర్ కోసం స్థలాన్ని ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ ఆర్డీవో గోపిరావు, ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఎన్టీఆర్ మినీ స్టేడియం సమీపంలో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే వంశీకృష్ణ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నాక్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను అచ్చంపేటతో పాటు నల్గొండ జిల్లాలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కేంద్రం ద్వారా నల్లమల ప్రాంతంలోని నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి, వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఈ సెంటర్ ఏర్పాటుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఆ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలకు నాయకులు ధన్యవాదాలు తెలిపారు.

బైక్, లారీ ఢీకొని ఒకరి దుర్మరణం

వంగూరు, జనవరి 24: బైక్, లారీ ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం సర్వారెడ్డిపల్లి గేటు సమీపంలో బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. వెల్దండ మండలం కొత్ర గ్రామానికి చెందిన శ్రీను(40) వంగూరు మండలం సర్వారెడ్డి పల్లి గేటు సమీపంలో జరుగుతున్న షరీఫ్ దర్గా ఉత్సవాల్లో మటన్ సీకులు కాల్చే దుకాణం పెట్టాడు. మంగళవారం రాత్రి రోడ్డు పక్కనే బైక్‌ను పెట్టుకొని, దాని పక్కనే నిద్రించాడు. బుధవారం తెల్లవారుజామున ఒక లారీ వేగంగా వచ్చి, బైక్‌ను ఢీకొట్టింది. బైక్ శ్రీను తలపై పడి, తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే 108 అంబులెన్స్‌లో కల్వకుర్తికి తరలిస్తుండగానే మార్గం మధ్యలోనే మృతి చెందాడు. శ్రీనుకు భార్య సుమిత్ర, ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. కేసు దార్యప్తులో ఉంది.

తుల్జాభవానీ సంబురం



సంప్రదాయ దుస్తుల్లో గిరిజనులు

వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండలం దొంతికుంట తండాలో గిరిజనులు తుల్జా భవానీ పండుగను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. రెండేళ్లకోసారి జరిగే ఈ వేడుక కోసం గిరిజనులు ఇంటి దేవతను ఇళ్లలో ప్రతిష్ఠించుకుంటారు. సంప్రదాయ దుస్తులు ధరించి, ఆమెను కొలుస్తారు. పండుగ దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' తన కెమెరాలో బంధించింది.

\- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటో గ్రాఫర్, వనపర్తి



ఓ ఇంటి వద్ద ప్రతిష్ఠించిన తుల్జాభవానీ అమ్మవారు



సామూహిక పూజల్లో పాల్గొన్న గిరిజనులు



వంట చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్న మహిళలు



వంటలు చేస్తున్న గిరిజన మహిళ



బియ్యం చెరుగుతున్న యువతి

కాలకేయుడిని చంపినోడే బాహుబలి

- పాలమూరులో రాక్షసపాలన ముగిసింది
- సీడబ్ల్యూసీ ఆహ్వానితుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వంశీచంద్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి

మహబూబ్‌నగర్ న్యూటౌన్, జనవరి 24: 'పాలమూరులో రాక్షస పాలన ముగిసింది. ప్రజా పాలన మొదలైంది. ప్రజలంతా ప్రశాంతంగా ఉన్నారు. కాలకేయుడిని చంపినోడే బాహుబలి'అని సీడబ్ల్యూసీ ఆహ్వానితుడు, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని జేజేఆర్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షత వహించారు. వంశీచంద్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పదేళ్లుగా పాలమూరు ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడిపారని, వ్యాపారం చేసుకుందామన్నా భయపడేవారన్నారని చెప్పారు. గత పాలనలో భూకబ్జలతో పాటు బెదిరింపులకు పాల్పడేవారన్నారు. ఇప్పుడు అవన్నీ పోయి, ప్రజలు ప్రశాంతంగా జీవనం గడుపుతున్నారన్నారు. మహబూబ్‌నగర్‌లో త్వరలోనే రూ.15 కోట్లతో క్రికెట్ మైదానం ఏర్పాటుకు బీసీసీఐతో మాట్లాడినట్లు తెలిపారు. పార్లమెంట్ నియోజకవర్గంలో రూ.1,000 కోట్లతో పార్లేజీ బిస్కెట్ కంపెనీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పని అయిపోయిందని, పాలమూరులో అరాచక శక్తుల ఆటలు సాగవన్నారు. ఇక్కడ బీఆర్‌ఎస్ మూలాలు లేకుండా చేస్తామన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత కేసీఆర్, కేటీఆర్, మాజీ మంత్రులు తట్టాబుట్ట సర్దుకొని దిక్కులేని చోటకు వెళ్లడం ఖాయమన్నారు. బీఆర్‌ఎస్‌ను ఓడించామని, బీజేపీని తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ పరిధిలోని బీఆర్‌ఎస్ నాయకులు తనకు నిత్యం ఫోన్ చేసి, కాంగ్రెస్‌లో చేరతామని అడుగుతున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో వంశీచంద్‌రెడ్డి భారీ మెజారిటీతో గెలిపిచాలన్నారు. పార్టీ గెలుపు కోసం కృషి చేసిన కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. పార్లమెంట్ స్థానాన్ని గెలిపించి, సీఎంకు కానుకగా ఇద్దమని మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి అన్నారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే భూ భకాసురుల భరతం పడామన్నారు. ఇతర పార్టీల నాయకులను తమ పార్టీలోకి తీసుకోమన్నారు. సమావేశంలో ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

నేడు సూగూరు కోదండరామస్వామి ఆలయంలో సామూహిక వ్రతాలు

పెబ్బేరు రూరల్, జనవరి 24 : వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం సూగూరు గ్రామంలోని కోదండరామస్వామి ఆలయంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధ్వర్యంలో గురువారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించనున్నామని తిరుమల తిరుపతి శ్రీవారి సేవకులు సితార వెంకటేశ్వర్లు తెలిపారు. సామూహిక వ్రతాలు చేయదలుచుకున్న భక్తులు అధిక సంఖ్యలో తరలి రావాలని ఆయన పేర్కొన్నారు.

అడవి మృగాల దాడిలో రెండు దూడల మృతి

- చంపింది చిరుతనా?, హైనానా.?
- మూగజీవాలపై దాడితో రైతుల ఆందోళన

ఖిల్లాఘణపురం, జనవరి 24 : వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలంలోని షాపూర్, మానాజీపేట గ్రామాల శివారు ప్రాంతాల్లో మంగళవారం రాత్రి వేర్వేరు ప్రాంతాల్లో అడవి మృగాల దాడిలో రెండు దూడలు మృతి చెందాయి. మండలంలోని షాపూర్ గ్రామ శివారు ప్రాంతంలో కర్నేతండా సాగునీటి కాలువ వద్ద మామిళ్ల భీమయ్యకు చెందిన బర్రె దూడ అడవి మృగాల దాడిలో మృతి చెందిందని బాధితుడు వాపోయాడు. అదేవిధంగా, మానాజీపేట గ్రామ శివారులో సాగునీటి కాలువ దగ్గర హరిజన కర్రె చెన్న నరసింహకు చెందిన లేగ దూడపై అడవి మృగం దాడి చేసి చంపిందని బాధిత రైతు కన్నీరు మున్నీరయ్యాడు. మండలంలో రెండు నెలలుగా తరచు అడవి మృగాలు మూగజీవాలపై దాడి చేస్తున్నా సంబంధిత శాఖ అధికారులు మాత్రం నామమాత్రపు గాలింపు చర్యలు చేపడుతున్నారని ప్రజలు వాపోతున్నారు. ఈ విషయంపై అటవీశాఖ డిప్యూటీ రేంజర్ భాస్కరాచారిని వివరణ కోరగా పశువులపై తరచుగా గుర్తు తెలియని అడవి మృగం దాడులు చేయడం వాస్తవమేనని, దాడులు జరిగిన ప్రాంతంలో చిరుత అడుగుజాడలు స్పష్టంగా కన్పించడం లేదని అన్నారు. మండలంలో సంచరిస్తున్నది చిరుతనా, హైనానా అనే అనుమానం ఉందని పేర్కొన్నారు. దాడిలో మరణించిన మూగజీవాలకు నష్టపరిహారం అందజేస్తామని ఆయన తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వీపనగండ్ల, జనవరి 24 : రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై రవిప్రకాష్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం పసుపుల గ్రామానికి చెందిన సుప్పరి సురేష్(27) ఈనెల 22న అమ్మాయిపల్లి నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. అదే సమయంలో బొల్లారం చౌరస్తా నుంచి వీపనగండ్లకు చెందిన నరసింహ స్వగ్రామానికి వస్తున్నాడు. తూముకుంట సమీపంలో ప్రమాదవశాత్తు రెండు బైకులు ఢీకొన్నాయి. ప్రమాదంలో తీవ్రంగా గాయప డిన సురేష్ కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం బ్రెయిన్ డెడ్‌తో మృతి చెందినట్లు ఎస్సై వివరించారు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. సురేష్ అవయవాలను దానం చేస్తున్నట్లు అతని కుటుంబ సభ్యులు తెలిపినట్లు ఎస్సై చెప్పారు.

‘రెవెన్యూ’ వద్ద ఆ భూమి రికార్డుల్లేవ్!

- హైదరాబాద్-శ్రీశైలం హైవే భూమి వివరాలివ్వాలని ఎన్‌హెచ్‌ఏఐకు వినతి
- ‘రహదారికీ రైతుబంధు’పై విస్తృత చర్చ
- ‘ఆంధ్రజ్యోతి’ కథనంపై అధికారుల ఆరా

ఆమనగల్లు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ‘రహదారికీ రైతుబంధు’ శీర్షికన బుధవారం ‘ఆంధ్రజ్యోతి’లో ప్రచురితమైన కథనం సర్వత్రా చర్చనీయాంశమైంది. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి నిర్మించిన భూమికి ప్రభుత్వం ఏళ్లుగా రైతుబంధు సొమ్ము ఇస్తూ వచ్చిన వైనాన్ని ‘ఆంధ్రజ్యోతి’ బయటపెట్టింది. అయితే రోడ్డు నిర్మించిన భూమికి సంబంధించి రెవెన్యూ అధికారుల వద్ద సరైన రికార్డులు లేనట్లు సమాచారం. దాంతో ఆ రికార్డులు అందజేయాలని రెవెన్యూ అధికారులు.. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులను కోరినట్లు తెలిసింది. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు, కడ్తాల్ మండలాల్లో ఈ సమస్య వెలుగుచూసింది. రోడ్డు కోసం పట్టా భూములను సేకరించినా దానికి అనుగుణంగా రికార్డుల్లో మార్పు చేయలేదు. గత ప్రభుత్వ లోపాల వల్ల ఈ భూమికి రైతుబంధు సహాయం అందుతుండడమే కాక మరో సమస్య కూడా తలెత్తుతోంది. భూముల ధరలకు రెక్కలు వస్తుండడంతో చాలామంది రైతులు జాతీయ రహదారి ఉన్న భూమిని కూడా ధరణి రికార్డుల ఆధారంగా విక్రయించి సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఫిర్యాదులు ఉన్నాయి. ఇదే జరిగితే పెద్దఎత్తున వివాదాలు చోటు చేసుకునే అవకాశాలు లేకపోలేదు. ఇటీవల కడ్తాల- మైసిగండి మధ్య రోడ్డు నిర్మాణం జరిగిన 1.20 ఎకరాల భూమి.. ధరణి పాస్ పుస్తకంలో కూడా ఉండడంతో రూ.5 కోట్లకు విక్రయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, దాన్ని వేరొకరికి రిజిస్ట్రేషన్ చేయకుండా బ్లాక్‌లిస్టులో పెట్టాలని రాష్ట్ర ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు అందింది.


హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి

కాగా, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను రికార్డులు అడగడంతో పాటు రోడ్డు ఉన్న సర్వే నంబరు భూములను పరిశీలించి సంబంధిత రైతుల రికార్డుల నుంచి ఆ భూమిని తొలగించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఇటు ప్రభుత్వం ఈ విషయమై ఉన్నతస్థాయి విచారణ జరిపిస్తే అనేక విషయాలు వెలుగుచూసే అవకాశం ఉందన్న అభిప్రాయం స్థానిక ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. ఆమనగల్లుకు చెందిన ఓ రైతు ఇటీవల స్థానిక తహసీల్దార్‌కు, కడ్తాల్‌కు చెందిన మరో రైతు ప్రజావాణిలో సీఎం రేవంత్ రెడ్డికి ఇదే విషయమై ఫిర్యాదు చేశారు.

కేసీఆర్‌ను సీఎం చేద్దాం

(మొదటి పేజీ తరువాయి)

సమావేశానికి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు బాధాకరమేమీ కాదని, చాలా చిన్న దెబ్బ మాత్రమే తగిలిందని అన్నారు. "ప్రజలు మనల్ని ఛీకొట్టలేదు. 39 స్థానాల్లో గెలిచాం. మరో 14 స్వల్ప తేడాతో ఓడాం. ఆ 14 స్థానాల్లో ఇతర పార్టీలు గతంలో రెండు, మూడు, నాలుగుసార్లు వరుసగా పోటీచేసి.. ఒక్కసారైనా గెలిపించాలంటూ ఏడవడంతో ప్రజలు భావోద్వేగాలతో వారికి ఓటేశారు. ఇందులో ఆరేడు స్థానాలు బీఆర్‌ఎస్ గెలిస్తే ఎలా ఉండేది? 1.85 శాతం ఓట్ల తేడాతో మాత్రమే అధికారం కోల్పోయాం" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజల తీర్పు ను అవమానపరిచే విధంగా మాట్లాడవద్దని పార్టీ శ్రేణులు, సోషల్ మీడియా వారియర్స్‌కు సూచించారు. "కరీంనగర్ లోక్‌సభ పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో కరీంనగర్, సిరిసిల్ల, హుజూరాబాద్‌లో గెలిచాం. మిగిలిన నాలుగింటిలో కూడా వారు సానుభూతితోనే గెలుపొందారు. అయినా మనకంటే వారికి కేవలం ఐదారు వేల ఓట్లు మాత్రమే ఎక్కువ వచ్చాయి. ఈ ఏడుపు, సానుభూతి ఎప్పటికీ ఉండదు" అని వ్యాఖ్యానించారు.


బీఆర్‌ఎస్ సోషల్ మీడియా వారియర్స్ భేటీలో మాట్లాడుతున్న కేటీఆర్

420 హామీలతో ప్రజలను నమ్మించారు..

ఎన్నికల్లో తప్పుడు హామీలతో రేవంత్‌రెడ్డి ప్రజలను నమ్మించారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలే కాకుండా.. మేనిఫెస్టోలో పేర్కొన్నవన్నీ కలిపి 420 హామీలు ఇచ్చారని, వాటిని ప్రజలకు వివరించి అమలయ్యే వరకు పోరాడుదామని పిలుపునిచ్చారు. హామీలు అమలు చేయకుంటే రోడ్లపై బట్టలూడదీసి ప్రభుత్వాన్ని నగ్నంగా నిలబెడతామని హెచ్చరించారు. సోషల్ మీడియాను పదునుగా వాడుకొని నరేంద్రమోదీ ప్రధానమంత్రి, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని చెప్పారు. రైతు భరోసా ఇచ్చామంటూ రేవంత్‌రెడ్డి దావోస్‌లో పచ్చి అబద్ధం చెప్పారని, రైతుబంధు పేరు మార్చారే తప్ప.. డబ్బులు ఇవ్వలేదని తెలిపారు. రైతుబంధు పడలేదంటే చెప్పుతో కొడతామంటూ మంత్రి కోమటిరెడ్డి చేసిన వాఖ్యలపై కేటీఆర్ మండిపడ్డారు. రైతు భరోసా రాని70 లక్షల మంది రైతులు ఈ ప్రభుత్వాన్ని చెప్పుతో కొడతారో, ఓట్లతో కొడతారో ఆలోచించుకోవాలన్నారు. క్వింటాల్ ధాన్యానికి ఇస్తామన్న రూ.500 బోనస్ ఇచ్చి తీరాలని డిమాండ్ చేశారు. మార్పు కావాలని ఓట్లు వేసిన 6.5 లక్షల ఆటో కార్మికుల కుటుంబాల కొంప కొల్లేరు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు వారికి ఏ అవకాశమచ్చినా కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఎరువులు, విత్తనాల దుకాణాల వద్ద క్యూ కట్టాల్సి వస్తుందని ఎవరూ అనుకోలేదని, మళ్లీ ఆ రోజులు వచ్చాయని విమర్శించారు. బస్సుల సంఖ్యను పెంచకుండా, బస్సుల కండిషన్ ఎలా ఉందో తెలుసుకోకుండా అనాలోచితంగా మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయడంతో బస్సుల్లో వారు కొట్టుకుంటున్నారని తెలిపారు. మరోవైపు డబ్బులు పెట్టుకొని వెళ్లే పురుషులకు సీట్లు దొరకడం లేదని, ఎవరూ సంతృప్తిగా లేరని అన్నారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ హామీ ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలోని కోటి 57 లక్షల మంది మహిళలకు నెలకు 2,500 ఇవ్వకుంటే తాట తీయాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారని అసెంబ్లీలో ప్రశ్నిస్తే.. తాము ఆ హామీ ఇవ్వలేదని భట్టివిక్రమార్క అన్నారని చెప్పారు.

మతం, దేవుళ్లతో బీజేపీ రాజకీయం..

బీజేపీ ఎంపీలు మతం, దేవుళ్లతో దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. నిత్యం మతం, ధర్మం అంటూ రెచ్చగొడుతూ కరీంనగర్‌లో గెలిచిన బండి సంజయ్‌కుమార్ అట్టర్ ఫ్లాప్ ఎంపీ అని విమర్శించారు. వేములవాడ, కొండగట్టు, ఇల్లందకుంట రామాలయానికి మోదీ నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదన్నారు. ఐదేళ్లలో సంజయ్ చేసిన అభివృద్ధి ఏంటో మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌తో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. బీజేపీ, బీఆర్‌ఎస్ ఒకటేనంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నలుగురు ఎంపీలను ఓడించింది బీఆర్‌ఎస్ కాదా? రెండు పార్టీలు ఒకటైతే కామారెడ్డిలో కేసీఆర్ ఓడిపోయేవారా? అని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మోదీ, అదానీ ఒకటేనంటూ రేవంత్, రాహుల్ గాంధీ ప్రచారం చేశారని, ఇప్పుడు ఆయనతోనే ఒప్పందం కుదుర్చుకున్నారని విమర్శించారు. బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్‌లో మోదీ, అదానీ తరువాత.. రేవంత్ మూడో ఇంజన్‌గా మారారన్నారు. కేసీఆర్ సర్కారు పదేళ్లు అదానీని రాష్ట్రంలో అడుగుపెట్టనీయలేదని, అమిత్‌షా, మోదీ సూచనతోనే అదానీతో రేవంత్ ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని విద్యుత్ ప్రాజెక్టులు, ఇతర సంస్థలను అదానీకి కట్టబెడతారన్నారు. రేవంత్ మరో ఏక్‌నాథ్ షిండే అయినా ఆశ్చర్య పోవలసిన అవసరం లేదని, మైనారిటీలు ఆలోచించాలని సూచించారు.


మీడియాతో ప్రభాకర్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, మహిపాల్‌రెడ్డి

విపక్ష ఎమ్మెల్యేలు సీఎంను కలవకూడదా?


- రేవంత్ తెలంగాణ రాష్ట్రానికి సీఎం కాదా?
- సమస్యల పరిష్కారం కోసమే కలిశాం
- పార్టీని వీడేది లేదు.. ప్రతిపక్షంలోనే ఉంటాం
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు సునీత, ప్రభాకర్‌రెడ్డి మహిపాల్‌రెడ్డి, మాణిక్‌రావు స్పష్టీకరణ

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):"కాంగ్రెస్ పార్టీకే.. రేవంత్ ముఖ్యమంత్రా? తెలంగాణకు కాదా? నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారం కోసం ప్రతిపక్ష నేతలు సీఎంను కలవకూడదా?" అని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, కె.మాణిక్‌రావు ప్రశ్నించారు. తాము కాంగ్రెస్‌లో చేరుతున్నామంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. రెండ్రోజుల క్రితం ఈ నలుగురు ఎమ్మెల్యేలూ సీఎం రేవంత్‌ను కలవడంతో వారు పార్టీ మారుతున్నారన్న ప్రచారం జోరందుకుంది. ఈ నేపథ్యంలో వారు బుధవారం మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌ను మర్యాదపూర్వకంగానే కలిశామని, ప్రజాసమస్యలను చర్చించడంతోపాటు సెక్యూరిటీ, ప్రొటోకాల్ సమస్యలపై కూడా మాట్లాడామన్నారు. ప్రతిపక్షంలో ఉంటే సీఎంను, మంత్రులను కలవకూడదా? ప్రధాని మోదీని, కేంద్రమంత్రులను సీఎం రేవంత్ కలవడం లేదా అని ప్రశ్నించారు. తమ నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారం కోసం, అభివృద్ధి అంశాల్లో సహకరించాలని సీఎంను కోరామన్నారు. కాంగ్రెస్ లోకి వెళ్లాల్సిన అవసరం తమకు ఏముందని వారు ప్రశ్నించారు. సీఎంను మాత్రమే కాదని, సమస్యల పరిష్కారం కోసం మంత్రులనూ కలుస్తూనే ఉంటామన్నారు. తమపై చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఆపాలని, లేకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్టీ మారే ప్రసక్తే లేదని.. ప్రతిపక్షంలోనే ఉండి పోరాడతామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్సే మెజార్టీ స్థానాల్లో గెలుస్తుందని అన్నారు.

రాహుల్ ప్రజల్లోకి వెళ్తుంటే బీజేపీకి ఎందుకంత భయం?

- గుడికి వెళ్లడానికీ అసోం సీఎం అనుమతి కావాలా?
- అప్పట్లో బతుకమ్మ పేరుతో కవిత మాదిరిగానే ఇప్పుడు రామాలయం పేరుతో మోదీ సినిమా చూపిస్తున్నారు..
- అయోధ్య గుడికి కారకుడైన అడ్వాణీని సన్మానించారా?: జగ్గారెడ్డి

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): "రాహుల్‌గాంధీ ప్రజల్లోకి వెళుతుంటే.. బీజేపీకి ఎందుకంత భయం? రాహుల్ గాంధీ గుడికి పోవద్దా? అందుకు అసోం సీఎం అనుమతి తీసుకోవాలా?" అంటూ టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి ప్రశ్నించారు. అసోం ప్రజలకు ఇబ్బంది లేకుండా రాహుల్‌గాంధీ పాదయాత్ర సాగుతోందని, అయితే ప్రధాని మోదీ దగ్గర మెప్పు కోసమే పాదయాత్రను అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ అడ్డుకున్నారని ఆరోపించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన గాంధీ కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ గాంధీని యాత్ర చేయకుండా అడ్డుకునే కుట్రను బీజేపీ చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. గాంధీభవన్‌లో బుధవారం మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడారు. మోదీ పాలనలో న్యాయమైన పాలన జరగట్లేదని, ధరల పెరుగుదలకూ అడ్డూ అదుపూ లేకుండా పోతోందని విమర్శించారు. దీనిపై ప్రజలను సంఘటితం చేసే పనిలో భాగంగా రాహుల్‌గాంధీ ‘న్యాయ్ యాత్ర’ను చేపట్టారని, అసోంలో రాహుల్ యాత్రను బీజేపీ వాళ్లు అడ్డుకోవడం ఎంతవరకు సమంజసం? అని జగ్గారెడ్డి ప్రశ్నించారు. ఉద్దేశపూర్వకంగానే అసోం ప్రభుత్వం అక్కడ శాంతి భద్రతల సమస్యను సృష్టిస్తోందని ఆరోపించారు. నిన్న మొన్నటిదాకా బతుమ్మ పండుగే లేనట్లుగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత బతుకమ్మ పేరుతో సినిమా చూపించిందని, ఇప్పుడు ప్రధాని మోదీ.. రామాలయం పేరుతో సినిమా చూపిస్తున్నారని విమర్శించారు. బీజేపీ నేతలు ఈ మధ్యనే కళ్లు తెరిచి.. రాములవారిని మొక్కాలని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. "రాములవారు పుట్టిన తర్వాత బీజేపీ పుట్టిందా? బీజేపీ పుట్టిన తర్వాత దేవుడు పుట్టాడా? ఆ పార్టీ పుట్టి కేవలం 40 ఏళ్లు అవుతుంది. సీతమ్మ, రాముల వారు పుట్టి నాలుగు యుగాలవుతోంది. ప్రధాని మోదీ, ఇక్కడి బీజేపీ నేతలు సీతారాముల కల్యాణం చేస్తారో లేదో తెలియదు నేను. మాత్రం ప్రతియేటా చేస్తాను" అని వ్యాఖ్యానించారు. అయోధ్య గుడికి అసలు కారకుడు బీజేపీ సీనియర్ నేత అడ్వాణీ అని, ఆయన దేశమంతా తిరిగి అయోధ్యలో రామాలయం కట్టాలని ప్రచారం చేశారని చెప్పారు. అలాంటి అడ్వాణీని కనీసం సన్మానించారా? అంటూ బీజేపీ నేతలను నిలదీశారు. సొంత పార్టీ నేత అడ్వానీ త్యాగమే గుర్తించని బీజేపీ.. కాంగ్రెస్ పార్టీ నేతల త్యాగం గుర్తిస్తుందా? అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌ను ఎందుకు కలిశారో తనకు తెలియదు కానీ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో సీఎంను ఎమ్మెల్యేలు కలవాలంటే కుదిరేది కాదన్నారు. గత తొమ్మిదేళ్లలో దక్కని అవకాశాన్ని సీఎం రేవంత్ 2 నెలల్లోనే కల్పించారన్నారు. గత తొమ్మిదేళ్లుగా చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకే సీఎం రేవంత్‌పై బీఆర్‌ఎస్ నేత కేటీఆర్ ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.



గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

ఈసీ ఆదేశాలతో వేటు పడిన ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు

- అమోయ్‌కుమార్, సుశీల్‌కుమార్, శ్రీధర్‌లకు బాధ్యతలు..

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో వేటు పడిన ఐఏఎస్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం తిరిగి పోస్టింగులు ఇచ్చింది. ఈమేరకు సీఎస్ శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే.. వేటు పడిన అధికారులకు అప్రాధాన్య పోస్టింగులు ఇవ్వడం గమనార్హం. అలాగే సుదీర్ఘకాలం పాటు సింగరేణి సంస్థ సీఎండీగా పని చేసి, ఇటీవల బదిలీ అయి వెయిటింగ్‌లో ఉన్న ఎన్.శ్రీధర్‌కు కూడా ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. ఆయన్ను షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించింది. ఇప్పటివరకు ఈ బాధ్యతలు చూస్తున్న సాగునీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాను బాధ్యతల నుంచి రిలీవ్ చేసింది. ఈసీ ఆదేశాలతో పోస్టింగ్‌లు కోల్పోయి, వెయిటింగ్‌లో ఉన్న డి.అమోయ్‌కుమార్‌ను పశు సంవర్ధక శాఖ జాయింట్ సెక్రటరీగా, టి.వినయ్‌కృష్ణారెడ్డిని వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ సెక్రటరీగా, ఎస్.హరీశ్‌ను రవాణా, రోడ్లు-భవనాల శాఖ జాయింట్ సెక్రటరీగా ప్రభుత్వం నియమించింది. గనుల శాఖ డైరెక్టర్‌గా ఉన్న పి.కాత్యాయనిదేవిని బదిలీ చేసి తెలంగాణ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్(టీఎస్ఐఆర్‌డీ) సీఈఓగా నియమించింది. ఈ పోస్టు అదనపు బాధ్యతలు చూస్తున్న పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాను రిలీవ్ చేసింది. అలాగే వెయిటింగ్‌లో ఉన్న నాన్-కేడర్ అధికారి సుశీల్‌కుమార్‌ను గనుల శాఖ డైరెక్టర్‌గా నియమించింది.

మే నెలలో ఎంసెట్.. నేడు షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వచ్చే మే నెలలో ఎంసెట్ ప్రవేశ పరీక్షను నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్ గురువారం విడుదలకానుంది. ఎంసెట్‌తోపాటు రాష్ట్రంలో నిర్వహించే ఇతర ప్రవేశ పరీక్షల షెడ్యూళ్లను కూడా ఇదే రోజున అధికారులు విడుదల చేయనున్నారు. ఈ ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ఆమోదం తెలిపారు. ఎంసెట్‌తోపాటు లాసెట్, ఐసెట్, ఈసెట్ వంటి ప్రవేశ పరీక్షలను నిర్వహించాల్సి ఉంది. ఈ సెట్ల షెడ్యూల్‌ను ముందుగానే విడుదల చేస్తే అందుకనుగుణంగా విద్యార్థులు సన్నద్ధం కావడానికి అవకాశముంటుంది. అధికారులు కూడా ప్రవేశ పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లు చేసుకునే వీలుంటుంది. ఈ నేపథ్యంలో ఆయా సెట్లను నిర్వహించే కమిటీలు, కన్వీనర్లను కూడా ప్రకటించనున్నారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్ నియామక ఫైల్‌ను

సత్వరం ఆమోదించండి

తమిళిసైతో సీఎం, డిప్యూటీ సీఎం భేటీ

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందర రాజన్‌తో భేటీ అయ్యారు. ప్రభుత్వం తరపున నిర్వహించే గణతంత్ర దినోత్సవాలకు హాజరు కావాల్సిందిగా ఆమెను ఆహ్వానించారు. గవర్నర్‌తో 20 నిమిషాలపాటు ప్రత్యేకంగా సాగిన సమావేశంలో.. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ నియామకం, గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పేర్లపై చర్చించినట్లు సమాచారం. టీఎస్‌పీఎస్సీకి చైర్మన్‌ను నియమించి ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని భావిస్తున్న ప్రభుత్వం.. రెండు రోజుల క్రితమే దానికి సంబంధించిన ఫైల్‌ను పంపింది. దానికి సత్వరం ఆమోదం తెలపాలని సీఎం, డిప్యూటీ సీఎం ఈ భేటీలో గవర్నర్‌కు విజ్ఞప్తి చేసినట్టు తెలిసింది. ఆ ప్రక్రియ ముగిసిన వెంటనే సభ్యులకు సంబంధించిన జాబితాను కూడా పంపిస్తామని చెప్పినట్టు సమాచారం. రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నందున ఈ ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు వారు గవర్నర్‌కు వివరించారు. తమిళిసై కూడా దీనికి సంబంధించి మరిన్ని వివరాలు అడిగి తెలుసుకున్నట్టు విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. ఇక గవర్నర్ కోటా ఎమ్మెల్సీల విషయానికి వస్తే.. గత ప్రభుత్వం దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ పేర్లను ప్రతిపాదించగా, వారిని నామినేట్ చేయడానికి తమిళిసై నిరాకరించిన సంగతి తెలిసిందే. గవర్నర్ కోటాలో నియమితులయ్యేవారు సాహిత్యం, శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం, సమాజ సేవ వంటి రంగాల్లో నిష్ణాతులై ఉండాలి. ఈ అర్హతలు లేవంటూ దాసోజు, కుర్ర పేర్లను గవర్నర్ తిరస్కరించారు. ఈ నేపథ్యంలో.. రేవంత్ సర్కారు ఆ కోటా కింద ఇద్దరి పేర్లను ప్రతిపాదిస్తూ ఫైల్‌ను గవర్నర్‌కు పంపాలని భావించింది. అయితే ఈలోగా దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ కోర్టుకు వెళ్లారు. తమ పేర్లను తిరస్కరించడం చట్టవిరుద్ధమని.. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా తమను నామినేట్ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని వారు కోర్టును కోరారు. దీంతో.. ఈ విషయం కోర్టులో ఉన్నందున తాను నిర్ణయం తీసుకోలేనని రేవంత్ సర్కారుకు గవర్నర్ స్పష్టం చేశారు. తాజాగా బుధవారం ఈ కేసును అడ్మిట్ చేసుకున్న న్యాయస్థానం.. ఎమ్మెల్సీలుగా కొత్త ప్రభుత్వం ప్రతిపాదించినవారిని గవర్నర్ నామినేట్ చేయకుండా స్టే ఇవ్వడానికి నిరాకరించింది. కాబట్టి ఈ ప్రక్రియపై ముందుకు వెళ్లొచ్చనే అభిప్రాయంలో ఉన్న ప్రభుత్వం.. ఆ విషయాన్ని గవర్నర్‌కు తెలిపింది. తాము ఈ కోటాకు అర్హులైన వ్యక్తులనే సిఫారసు చేస్తామని రేవంత్, భట్టి బుధవారం భేటీలో తమిళిసైకి వివరించగా.. దీనిపై న్యాయసలహా తీసుకుంటానని ఆమె చెప్పినట్టు తెలిసింది. ఫిబ్రవరి 2వ వారంలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాలు నిర్వహించే ఉద్దేశంతో ఉన్న నేపథ్యంలో రేవంత్, భట్టి ఆ విషయాన్ని కూడా గవర్నర్ వద్ద ప్రస్తావించినట్టు సమాచారం. కాగా.. గత కేసీఆర్ సర్కారు తీరుకు భిన్నంగా గణతంత్ర దినోత్సవాలకు గవర్నర్‌ను నేరుగా కలిసి ఆహ్వానించిన సీఎం, డిప్యూటీ సీఎం.. గవర్నర్ ప్రసంగానికి సంబంధించిన విషయాలను కూడా వివరించారు.


రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి

డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని ధర్నా



తహసీల్దార్ ఇబ్రహీంకు వినతి పత్రం అందజేస్తున్న లబ్ధిదారులు

కల్వకుర్తి, జనవరి 24 : కల్వకుర్తి పట్టణంలోని 99సర్వే నెంబరులో నిర్మించిన 240 డబుల్‌బెడ్రూం ఇళ్లకు గతంలోనే కలెక్టర్ ఆధ్వర్యంలో కేటాయింపులు జరిగాయని వెంటనే అట్టి ఇళ్లను ఇవ్వాలని తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల ముందు లబ్ధిదారులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం స్పందించి తక్షణమే కేటాయించిన డబుల్‌బెడ్రూం ఇళ్లను అధికారులు అప్పజెప్పాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఇబ్రహీంకు, ఆర్డీవో కార్యాలయంలో లబ్ధిదారులు వినతి పత్రం అందజేశారు. అనంతరం కల్వకుర్తి పట్టణంలోని స్థానిక మునిసిపల్ కార్యాలయం ముందు లబ్ధిదారులు నిరసన వ్యక్తం చేసి చైర్మన్ ఎడ్మ సత్యం, కమిషనర్ ఆశిత్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ లబ్ధిదారులు ఎవరూ ఆందోళన చెందాల్సినవసరం లేదని ఇదివరకే జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు డబుల్‌బెడ్రూం ఇళ్ల కేటాయింపులు జరిగాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లు అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

జననాయక్ కర్పూరి ఠాకూర్‌కు ఘన నివాళులు



కర్పూరి ఠాకూర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు

నాగర్‌కర్నూల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : బీహార్ మాజీ సీఎం దివంగత నేత కర్పూరి ఠాకూర్‌కు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించి గౌరవించడం హర్షణీయమని నాయీబ్రాహ్మణ సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వనపట్ల సుబ్బయ్య అన్నారు. నాగర్‌కర్నూల్ పట్టణంలో బుధవారం ఠాకూర్ చిత్ర పటానికి పూల మాలలు వేస్తూ నాయీ సంఘీయులంతా ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వనపట్ల సుబ్బయ్య మాట్లాడుతూ వెనకబడిన కులాల కోసం నిరంతరం చేసిన మహనీయులని జననాయక్‌గా జనం పిలుచుకుంటారని, ఆయన కృషిని గుర్తిస్తూ శత జయంతి సందర్భంగా భారతరత్న అత్యున్నత బిరుదు ప్రకటించిన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని మోదీకి అభినందనలు, ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. నాగర్‌కర్నూల్ నాయీబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు సదుర్ల తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి పురుషోత్తం, ఎం.శివుడు, ఎన్.బాలస్వామి, శేఖర్, ఎస్.బాలస్వామి, సత్యనారాయణ, శ్రీశైలం, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా డ్రైవర్స్ డే

కల్వకుర్తి, జనవరి 24 : కల్వకుర్తి పట్టణంలో ఆర్టీసీ డిపో మేనేజర్ సుభాషిణి ఆధ్వర్యంలో డ్రైవర్స్ డేను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. 30సంవత్సరాలు డ్రైవర్‌గా పని చేస్తూ ఒక్క యాక్సిడెంట్ కూడా చేయని సి.అంజయ్యను డిపో మేనేజర్ సుభాషిణి, అసిస్టెంట్ మేనేజర్ శ్వేతలు పూల మాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సంస్థ అభివృద్ధి కోసం డ్రైవర్లు, కండక్టర్లు చేస్తున్న కృషిని వారు కొనియాడారు. ఆర్టీసీ ఉద్యోగులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

● అచ్చంపేటటౌన్: డ్రైవర్స్ డే పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని ఆర్టీసీ డిపోలో డ్రైవర్లకు డిపో మేనేజర్ ప్రసాద్ పూలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్టీసీ అభివృద్ధిలో డ్రైవర్ల పాత్ర కీలకమన్నారు. ఆర్టీసీ సీఐ దేవి, ఎంఎఫ్ కృష్ణయ్య, సిబ్బంది బాలస్వామి, లింగస్వామి, డ్రైవర్లు పాల్గొన్నారు.

అభ్యుదయ రచనలు అవనికి ఆదర్శం

పెద్దకొత్తపల్లి, జనవరి 24 : అభ్యుదయ రచనలు అవనికి ఆదర్శమని ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ అన్నారు. బుధవారం సాయంత్రం మండల పరిషత్ కార్యాలయంలో అభ్యుదయ రచయితల సంఘం క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యుదయ రచనలు అవనికి ఆదర్శమని సమాజానికి ఆచరణీయమని ఆయన సూచించారు. అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి, సింగిల్ విండో మాజీ చైర్మన్ బి.బాలస్వామి, ఎంపీడీవో కృష్ణయ్య, సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ రవికుమార్, టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేశ్, వెంకటస్వామిగౌడ్,రాఘవేందర్, శంకర్ పాల్గొన్నారు.

అభయుడి బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్ విడుదల



జడ్చర్లలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అభయుడి బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి

ఊర్కొండ, జనవరి 24: నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయస్వామి వారి బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్లను బుధవారం జడ్చర్లలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, స్థానిక నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి అభయమిచ్చు ప్రదాతగా పేరు గాంచిన శ్రీఅభయాంజనేయ స్వామి వారి బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయాలని కోరారు, అధికారులు, నాయకులు, భక్తులను సమన్వయం చేసుకుంటూ బ్రహ్మోత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సత్యచంద్రా రెడ్డి, నాయకులు ఉన్నారు.

దారం కండెలతో అయోధ్య రామాలయ నమూనా

- ఉపాధ్యాయునికి అభినందనల వెల్లువ



ఉపాధ్యాయుడు, విద్యార్థులను సన్మానిస్తున్న హిందూ ఐక్య సంఘాల నాయకులు

తెలకపల్లి, జనవరి 24 : నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో దారం రీళ్లతో అయోధ్య రామ్‌లల్లా భవ్య మందిర నిర్మాణాన్ని అపురూపంగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయుడు వేణుగోపాల్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సందర్భంగా హిందూ ఐక్య సంఘాల వేదిక ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించారు. దారం కండెలతో అయోధ్య రామమందిర నిర్మాణానికి సహకరించిన విద్యార్థులు చిరంజీవులు, శశికుమార్, పవన్‌కుమార్‌లను సైతం సన్మానించారు. ఇలాంటి కార్యక్రమాలు ఇంకా ఎన్నో చేస్తూ అన్ని పాఠశాలలకు మార్గదర్శకంగా నిలవాలని వారు ఆకాంక్షించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెల్దండ, జనవరి 24 : నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల కేంద్రం సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడ్డాడు. వివరాల్లోకి వెళితే... తెల్కపల్లి మండలం తాళ్లపల్లి గ్రామానికి చెందిన నిరంజన్ ఆటోలో కల్వకుర్తివైపుకు వెళుతూ అదేదారిలో వెళుతున్న ట్రాక్టర్‌ను వెనుకనుండి ఢీకొట్టాడు. ఈ క్రమంలో నిరంజన్ తీవ్రంగా గాయపడ్డాడు. నిరంజన్‌ను 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

భూసేకరణ పనులు వేగవంతం చేయాలి

- కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఇరిగేషన్, జాతీయ రహదారులకు సంబంధించి భూసేకరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ ఆదేశించారు. బుధవారం ఐడీవోసీ కాన్ఫరెన్స్ హాల్లో ఇరిగేషన్, రెవెన్యూ జాతీయ రహదారి ఇంజనీర్లు, అధికారులతో భూసేకరణ, ఇరిగేషన్ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఎస్ఎల్‌బీసీ, పాలమూరు రంగారెడ్డి, ఉమామహేశ్వర రిజర్వాయర్, డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, జాతీయ రహదారి పనులకు సంబంధించి భూసేకరణ కారణంగా నిలిచిపోయిన పనులు, పునరావాస కేంద్రాల పురోభివృద్ధి, ఇతరత్రా సమస్యలపై చర్చించి పలు సూచనలు చేశారు. పబ్లికేషన్స్, అడ్మిన్‌కు సంబంధించిన బడ్జెట్ ఈఎన్‌సీ నుంచి విడుదల చేయించాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. అచ్చంపేట నియోజకవర్గానికి సంబంధించి ప్యాకేజీ-29 కింద అవసరమైన భూసేకరణ పనులు వేగవంతం చేయాలని సూచించారు. ప్యాకేజీ-30కి సంబంధించి డీపీఆర్ ప్రకారం ఆమోదిత అలైన్‌మెంట్ ప్రకా రం పనులు కొనసాగించాలని సూచించారు. మార్కండేయ రిజర్వాయర్‌పై సమీక్షిస్తూ భూసేకరణ పనులు పీఎస్ స్టేజ్‌లో ఉన్న వాటిని అవార్డు స్టేజ్‌కు తీసుకురావాలని రెవెన్యూ అధికారులు ఆదేశించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో కల్వకుర్తి నుంచి నంద్యాలకు వెళ్లే జాతీయ రహదారి జిల్లాలో 79.3కిలో మీటర్ల మేరకు సాగనున్న రహదారి విస్తీర్ణ పనులకు 110 హెక్టార్ల భూసేకరణ కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 60హెక్టార్ల భూసేకరణను త్వరితగతిన పూర్తి చేసి అందించాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాకు మంజూరైన జాతీయ రహదారి వివిధ ప్రాజెక్టుల భూసేకరణ ఇతరత్రా పనుల విషయంలో ఎప్పటికప్పుడు రెవెన్యూ ఇరిగేషన్, జాతీయ రహదారి శాఖల అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అదనపు కలెక్టర్లు కుమార్‌దీపక్, కే.సీతారామారావు, పాలమూరు రంగారెడ్డి ఎస్సీ సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఆర్డీవో రాంరెడ్డి, కల్వకుర్తి ఆర్డీవో శ్రీనివాసులు, అచ్చంపేట ఆర్డీవో గోపిరామ్, కొల్లాపూర్ ఆర్డీవో నాగరాజు, ఇరిగేషన్ ఈఈలు మురళి, సంజీవరావు, జాతీయ రహదారి ఈఈ కల్వకుర్తి రాజేందర్, డీపీఆర్‌వో సీతారాం, వివిధ ఇరిగేషన్ ప్రాజెక్టుల ఏఈలు, డీఈలు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

అవకాశం కల్పిస్తే బాలికలు అన్ని రంగాల్లో రాణిస్తారు

- అదనపు కలెక్టర్ కుమార్ దీపక్

- ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 24: బాలికలకు అవకాశాలు కల్పిస్తే ఆకాశమే హద్దుగా ఎదిగి ఆత్మస్థైర్యంతో అన్ని రంగాల్లో రాణిస్తారని అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని జడ్పీ మైదానంలో కేజీబీవీ పాఠశాలల విద్యార్థినులకు ఆటల పోటీలు నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో పోటీల్లో తాడూరు, లింగాల, పెద్దకొత్తపల్లి, ఉప్పునుంతల కేజీబీవీ విద్యార్థులకు ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు. కార్యక్రమానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికా సంరక్షణతో పాటు సాధికారత కల్పించే విధంగా చూడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. రాజ్యాంగబద్ధంగా బాలికలకు కల్పించిన హక్కులను గౌరవించాలన్నారు. ఆడపిల్లలను, మగ పిల్లలతో సమానంగా అవకాశాలను కల్పించాలన్నారు. చిన్నతనం నుంచే బాలికలకు అవకాశాలు కల్పించినప్పుడే సమాజంలో మార్పు సాధ్యం అవుతుందన్నారు. సమగ్ర శిక్ష గణాంకాధికారి మధుసూదన్‌రెడ్డి, కేజీబీవీల పర్యవేక్షణ అధికారి సూర్యచైతన్య, వీహబ్ ఉమెన్ జిల్లా కోఆర్డినేటర్ శ్వేత, జిల్లా క్రీడల అధికారి సీతారాం, డీసీపీఓ లక్ష్మణ్‌రావు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పాండు, కేజీబీవీల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

బాలికల శ్రేయస్సు భవిత భద్రత

బిజినేపల్లి: బాలికల శ్రేయస్సుతోనే సమాజ భవిత భద్రత ఉంటుందని కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ టి.ప్రభాకర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించి మాట్లాడారు. బాలికల స్వావలంబన, స్వాతంత్ర్యం సాధికారతల ప్రాముఖ్యతను విద్యార్థినులకు వివరించారు. బాలికల సమగ్ర అభివృద్ధి, పెరుగుదల, మంచి ఆరోగ్యం కోసం సరైన పోషకాహారం తీసుకోవాలని సూచించారు. అంతకు ముందు నిర్వహించిన సాహిత్య పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులను అందజేశారు. కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ ఇ.జ్యోత్స్న, విద్యాలయం ప్రిన్సిపాల్ నాగమణి పాల్గొన్నారు.

● కల్వకుర్తి: జాతీయ బాలిక దినోత్సవాన్ని కల్వకుర్తి పట్టణంలో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. కల్వకుర్తి పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల ఆధ్వర్యంలో బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు కార్యక్రమాలు చేపట్టారు. పట్టణంలోని సావిత్రిబాయి పూలే ఒకేషనల్ జూనియర్ కళాశాలలో కరస్పాండెంట్ రాజేందర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి సబ్ రిజిస్ట్రార్ సుశీల హాజరై మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

● వంగూరు: మండల కేంద్రంలోని కేజీబీవీ ఆశ్రమ పాఠశాలలో బుధవారం జాతీయ బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వంశీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలికలు బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలపై చక్కని పాటకు నృత్యం చేసి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ బాలికలు చక్కగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. జడ్పీటీసీ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు రమేష్‌గౌడ్, ప్రత్యేక అధికారి కృష్ణవేణి, మోపతయ్య, పండిత్‌రావు, వేమారెడ్డి, బొజ్జకృష్ణరెడ్డి, శరీఫ్‌ఖాన్, నారాయణరెడ్డి, శంకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

● ఉప్పునుంతల: మండల కేంద్రమైన ఉప్పునుంతలలోని బాలుర ప్రాథమిక పాఠశాలలో బుధవారం జాతీయ బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు బాలమణి, వెంకటేష్, పద్మావతి, పాల్గొని వారు మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని అన్నారు. భారత ప్రధాని, రాష్ట్రపతి, లాంటి పదవులు చేశారని ఆయన తెలిపారు.

● అమ్రాబాద్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ సుధారాణి ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ సుధారాణి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆధునిక సమాజంలో ప్రపంచవ్యాప్తంగా బాలికలు అన్ని రంగాల్లో ముందుకు దూసుకుపోతున్నారని అన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని బాలికలు ఎటువంటి ఆటంకాలు ఎదురైనా జీవితంలో భయపడవద్దని సూచించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అదనపు కలెక్టర్ కుమార్ దీపక్



విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి

పరస్పర సహకారంతో సమస్యల పరిష్కారానికి కృషి చేద్దాం

వంగూరు, జనవరి 24: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాప్రతినిదులు, అధికార యంత్రాంగం పరస్పర సహకారంతో ముందుకు సాగుదామని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. బుధవారం వంగూరులోని రైతు వేదిక భవనంలో మండల సర్వసభ్యసమావేశం జరిగింది. ఈ సమావేశానికి వంశీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. సర్పంచ్‌ల పదివికాలం వారం రోజుల్లో ముగుస్తుండటంతో వారిని వంశీకృష్ణ పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలిచ్చే పదవులకు సమాజంలో మంచి గౌరవం ఉంటుందన్నారు. 5 సంవత్సరాల పాటు ప్రజల మధ్యన ఉండి సేవలందిచి సర్పంచ్‌లు గ్రామాలభివృద్ధికి పాటుపడడంతో అభినందనీయమన్నారు. ఎల్లికల్లు-సర్వారెడ్డిపల్లి గేటు వరకు రెండు వరుసల రహదారికి నిధులు మంజూరయ్యాయని, కొంవారెడ్డిపల్లిలో రూ.వంద కోట్ల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీరోడ్లు, వీర జవాన్ స్మారక గ్రంథాలయం ఏర్పాటుకు నిధులు మంజూరైనట్లు ఆయన తెలిపారు. వంగూరు శివారులో వంద ఎకరాల్లో ఇండస్ట్రీయల్ పార్కును ఏర్పాటు చేసి, యువతకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఎంపీపీ భీమమ్మ, తహసీల్దార్ కిణ్ణయి, వైస్ ఎంపీపీ సంధ్య, పీఏసీఎస్ చెర్మన్‌లు సురేందర్‌రెడ్డి, జెల్లా గురువయ్యగౌడ్, ఎంపీడీవో విజయభాస్కర్, జిల్లా జడ్పీ కోఆప్షన్ మమీద్ తదితరులు పాల్గొన్నారు.



సర్పంచ్‌లను సన్మానిస్తున్న వంశీకృష్ణ

రాయలగండి అభివృద్ధికి కట్టుబడి ఉన్నా..

పదర: మండలంలోని రాయలగండి చెన్నకేశవస్వామి ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. బుధవారం రాయలగండి పుణ్యక్షేత్రాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయంలో ఉన్న సమస్యలను పూజారిని అడిగి తెలుసుకున్నారు. పూజారి దాశరథి మోహన్, నాయకులు బి.లింగం, ఆనంద్, డీసీసీ కార్యదర్శి రేణయ్య పాల్గొన్నారు.

రక్తహీనత నివారణే ఎనీమియా ముక్త్ భారత్ లక్ష్యం

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 24: విద్యార్థుల్లో రక్తహీనత నివారణే ఎనీమియా ముక్త్ భారత్ లక్ష్యమని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రవికుమార్‌నాయక్ అన్నారు. బుధవారం జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం పరిధిలోని ఉయ్యాలవాడ మహాత్మ జ్యోతిబా పూలే బాలికల గురుకుల విద్యార్థులకు రక్తహీతన పరీక్షలు నిర్వహించారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, వైద్యులు ఉమేర, శివ, విద్యాసాగర్, ఆర్.శ్రీనివాసులు, డి.కుమార్, ఆర్‌బీఎస్‌కె సిబ్బంది వినోద్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

'మల్లురవికే ఎంపీ టికెట్ ఇవ్వాలి'

తిమ్మాజిపేట, జనవరి 24 : ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యలు పరిష్క రిస్తూ పిలిస్తే పలికే డాక్టర్ మల్లురవికే నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానానికి కాంగ్రె స్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు టికెట్ ఇవ్వాలని రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్ బహదూర్ అన్నారు. తిమ్మాజిపేట మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ డాక్టర్ మల్లురవి సీనియర్ నాయకుడు గతంలో పార్లమెంట్ సభ్యుడిగా మంచి పేరు గల వ్యక్తి అని అనుభవజ్ఞులని అధి ష్టానం గుర్తించాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే కలిసికట్టుగా కార్యకర్తలు పని చేసి పార్లమెంట్ స్థానాన్ని గెలిపించుకోవడం ఖాయమన్నారు. మండల ప్రధాన కార్యదర్శి మాధవులు, కాంగ్రెస్ నాయకుడు మల్లేష్ ముదిరాజ్ ఉన్నారు.

మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి

- డీఎండబ్ల్యూవోకు వినతి పత్రం అందజేసిన ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు

కొల్లాపూర్, జనవరి 24 : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మైనార్టీ గురుకుల పాఠశాలలో ప్రేమ పేరుతో మైనర్ విద్యార్థినిని అపహరించుకుపోయిన వాచ్‌మెన్ తీరు పట్ల చర్యలపై సకాలంలో స్పందించని ప్రిన్సిపాల్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ డీఎండబ్ల్యూవోకు బుధవారం ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు లిఖితపూర్వకంగా వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు ఎండి.యూసుఫ్‌లు మాట్లాడుతూ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో పని చేస్తున్న ముగ్గురు యువకులైన వాచ్‌మెన్లను వెంటనే తొలగించి ఆడవాళ్లను విధుల్లోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాలలో వాచ్‌మెన్‌గా పని చేస్తున్న నిరంజన్ గత ఐదారు నెలల నుంచి అదే పాఠశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థినీతో ప్రేమాయణం నడుపుతున్న ప్రిన్సిపాల్ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంగా వ్యవహరించారని అమ్మాయి మిస్సింగ్ కేసుపై ప్రిన్సిపాల్ దాటవేత వైఖరి ప్రదర్శిస్తున్నారని వారు డీఎండబ్ల్యూవో దృష్టికి తీసుకెళ్లారు.

వాచ్‌మెన్లతో ప్రిన్సిపాల్ పాఠశాలకు సంబంధించిన డీడీలు, బ్యాంకు వ్యవహారాలు, పాఠశాలకు సంబంధించిన చీపురుకట్టలు, చాక్‌పీసులు తెప్పించుకునేందుకు వాచ్‌మెన్లను పాఠశాలలోకి అనుమతించేవారని, దీన్నే ఆసరాగా చేసుకుని వాచ్‌మెన్ నిరంజన్ పాఠశాల విద్యార్థినీని ప్రేమ పేరుతో వేధించాడని ఇలాంటి వ్యవహారాలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేసి యువకులను వాచ్‌మన్లుగా తొలగించి మహిళలను వాచ్‌మెన్లుగా విధుల్లోకి తీసుకోవాలని వారు కోరారు. మధుగౌడ్, నితిన్ ఉన్నారు.

దుండగులను శిక్షించాలి

పదర, జనవరి 24 : మండల పరిధిలోని వంకేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన దుండగులను గుర్తించి వారిని గుర్తించాలని గ్రామస్థులు, యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాలలో మరుగుదొడ్లను, వాటర్ సప్లయ్ పైపులను పూర్తిగా ధ్వంసం చేశారు. ఇది పాఠశాల సిబ్బంది గుర్తించి పాఠశాల సిబ్బందితోపాటు వివిధ సంఘాల వారు గుర్తించారు. ఇలాంటి ఘటనలు చాలా సార్లు పునరావృతమవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పోలీసులు ఈ ఘటనపై స్పందించి ఘటనకు కారణమైన వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

నాగర్‌కర్నూల్ క్రైం, జనవరి 24 : రోడ్డుప్రమాదంలో భర్త మృతి చెందగా చికిత్స పొందుతున్న భార్య లక్ష్మీ(25) మంగళవారం రాత్రి మృతి చెందింది. బిజినేపల్లి మండలం లింగసానిపల్లి గ్రామానికి చెందిన తిరుమలేష్, లక్ష్మీ నాగర్‌కర్నూల్ ఆసుపత్రికి వచ్చి ఇంటికెళ్తున్న క్రమంలో మంగళవారం సాయంత్రం మెడికల్ కళాశాల సమీపంలో హైదరాబాద్-2 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో తిరుమలేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతని భార్య లక్ష్మీ తీవ్ర గాయాలపాలు కావడంతో జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందింది. ఈ సంఘటనపై నాగర్‌కర్నూల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. తిరుమలేష్, లక్ష్మీలకు సంవత్సరం క్రితం వివాహమైంది. దంపతుల అంత్యక్రియలు బిజినేపల్లి మండలం లింగసానిపల్లి గ్రామంలో బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఏడాది క్రితం వివాహమైన దంపతులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. బంధువులు, తిరుమలేష్ కుటుంబ సభ్యుల రోదనలతో పలువురు కంటతడి పెట్టారు.

జన్‌మన్ పథకం అమలుపై వివరాల సేకరణ

మన్ననూర్, జనవరి 24: ప్రధానమంత్రి జన్‌మన్ పథకం అమలులో భాగంగా అధికార యంత్రాంగం నల్లమలలోని కొల్లంపెంట, కొమ్మన పెంట గ్రామాలను బుధవారం సందర్శించారు. అమ్రాబాద్ ఎంపీడీవో రామ్మోహన్, పంచాయతీరాజ్ రాజ్ ఏఈ రుక్మాంగరులు అక్కడి చెంచులతో సమావేశమయ్యారు. జన్‌మన్ పథకంలో చెంచులకు పక్కా గృహాల నిర్మాణం, రహదారి నిర్మాణం, నివాస సముదాయాలకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పన చేసే విషయమై ఆయా పెంటల్లో చెంచులతో వివరాలు సేకరించారు. ఇళ్ల నిర్మాణాలకు కావాల్సిన స్థల పరిశీలన చేశారు. ఐటీడీఏ ద్వారా నిర్మించనున్న అంగన్‌వాడీ భవన స్థలాన్ని గుర్తించి, భవన నిర్మాణానికి ఏర్పాట్లు చేశారు. అలాగే రెండు పెంటలకు 11.5 కిలో మీటర్ల రహదారి అవసరముందని కొలతల ద్వారా ఫైనల్ చేశారు. ఇట్టి నివేదికను ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మల్లేష్, ఉపాధి హామీ సాంకేతిక సహాయకుడు ఆంజనేయులు, వార్డు సభ్యుడు చౌకయ్య పాల్గొన్నారు.

ఇద్దరు ఎస్సీ కార్పొరేషన్ ఉద్యోగుల సస్పెన్షన్

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 24: ఎస్సీ కార్పొరేషన్ నిధులు దుర్వినియోగం విషయంలో కలెక్టర్ ఆదేశాల మేరకు బాధ్యులైన ఆఫీస్ సబార్డినేట్ ఎ.విష్ణు, సీనియర్ అసిస్టెంట్ పి.నారాయణస్వామి ఇద్దరు ఉద్యోగులను సస్పెన్షన్ చేసినట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి రాంలాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ రైతుల భూముల్లో పందిరి కూరగాయల కథకం యూనిట్ల ఏర్పాటు కోసం నకిలీ ఏజెన్సీలను సృష్టించి కార్పొరేషన్ నిధులను దుర్వినియోగం చేశారని పేర్కొన్నారు. నిధుల మళ్లింపుపై ఇద్దరు ఉద్యోగులపై పోలీసు కేసు నమోదు చేసి వాటి అకౌంట్లను సీజ్ చేశామ న్నారు. ఇద్దరి ఉద్యోగుల నిధుల దుర్వినియోగంపై ఎంక్వయి రీ అధికారిని నియమించి విచారణ జరిపించి నిధులను రీకవరీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

మల్లురవికి, సీఎం సోదరుడికి సన్మానం



మల్లురవిని సన్మానిస్తున్న మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్

కల్వకుర్తి, జనవరి 24 : ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సోదరుడు ఎనుముల తిరుపతిరెడ్డిని, ఢిల్లీలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా ఎంపికైన డాక్టర్ మల్లురవిని కల్వకుర్తి మాజీ సర్పంచ్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు బృంగి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు సన్మానించారు. కల్వకుర్తి అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహాయ సహకారాలందించాలని ఈ సందర్భంగా వారు కోరారు. సన్మానించిన వారిలో సర్పంచ్ తిరుపతిరెడ్డి, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, నాయకులు షానవాజ్‌ఖాన్, జిల్లెల రాములు, సంజీవ్‌కుమార్‌యాదవ్, భాస్కర్‌రెడ్డి, జంగయ్య, రమేష్‌నాయక్, జంగయ్యయాదవ్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఉప్పునుంతల, జనవరి 24: మండల పరిధిలోని అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన దాసరాజు శంకరమ్మ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మోపతయ్య బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతురాలు కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి అండగా ఉంటామన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు కాశన్న, నిరంజన్, అశోక్, దేవ, బాలయ్య ఉన్నారు.

ఆర్థిక సహాయం

కల్వకుర్తి, జనవరి 24 : కల్వకుర్తి మండలం పంజుగుల గ్రామానికి చెందిన వీరయ్య కుటుంబానికి ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ తలకొండపల్లి జడ్పీటీసీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ సమకూర్చిన ఆర్థిక సహాయాన్ని నాయకులు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్‌వీ కల్వకుర్తి అధ్యక్షుడు గణేష్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న కుటుంబాలకు ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. మాజీ సర్పంచ్‌పరుశరాములు, నాయకులు రాజేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ త్వరగా కోలుకోవాలని పూజలు

ఊర్కొండ, జనవరి 24: రాష్ట్ర ముఖ్యమంత్రి బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు తొందరగా కోలుకొని ప్రజాక్షేత్రంలోకి రావాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కరాటే రాజు నాయక్ కోరారు. ఈ సందర్భంగా ఆయన ప్రపం చంలోనే అతి పెద్ద హిందూ దేవాలయం కలిగిన కంబోడియా దేశంలోని ఆంగ్ కోర్‌వార్ ఆలయంలో రాజు నాయక్ మాజీ సీఎం త్వరగా కొలుకోవాలని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు.

విద్యార్థులు కష్టపడి చదువుకోవాలి

- నాంపల్లి ఎమ్మెల్యే మహమ్మద్ మాజీద్‌హుస్సేన్

కల్వకుర్తి, జనవరి 24 : విద్యార్థులు లక్ష్యంతో కష్టపడి చదువుకోవాలని నాంపల్లి ఎంఐఎం ఎమ్మెల్యే మహమ్మద్ మాజీద్‌హుస్సేన్ అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ఎంఐఎం ఆధ్వర్యంలో పదవ తరగతి ఉర్దూ మీడియం విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ మోడల్ పేపర్స్ పంపిణీ బుధవారం జరిగింది. ఎంఐఎం కల్వకుర్తి పట్టణ అధ్యక్షుడు ఎం.ఎ.సత్తార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాంపల్లి ఎమ్మెల్యే మహమ్మద్ మాజీద్‌హుస్సేన్‌హాజరై పదవ తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్‌మోడల్ పేపర్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇష్టంతో కష్టపడి చదవాలని ఆయన సూచించారు. నాయకులు జనాబ్ జబ్బార్, సయ్యద్‌సాహెబ్, ఎం.ఎ.సత్తార్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

పెద్దకొత్తపల్లి, జనవరి 24 : విద్యార్థులు క్రీడల్లో రాణించాలని పెద్దకొత్తపల్లి సర్పంచ్ ఆదెర్ల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రమైన పెద్దకొత్తపల్లిలోని ఉన్నత పాఠశాలలో ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. పాఠశాల హెచ్ఎం మద్దిలేటి, వార్డు సభ్యులు డబ్బ ఎల్లయ్య, ఉపాధ్యాయులు సందీశ్వర్, రాఘవేందర్, వెంకటస్వామిగౌడ్, హఫీజ్‌ఖాన్, దేవయ్య, సాయిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అవసరమైతే మీ సేవలో దరఖాస్తు చేసుకోండి

తిమ్మాజిపేట, జనవరి 24 : ఇసుక అవసరం ఉన్న వారు మీ సేవ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ జేకే.మోహన్ సూచించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన మైనింగ్ సిబ్బంది బుధవారం తహసీల్దార్‌ను కలిసి ఇసుక సరఫరాపై అవసరమైన పత్రాలను ఆయనకు అందజేశారు. ఆవంచ సమీపంలోని దుందుభీ వాగు నుంచి తిమ్మాజిపేట, బిజినేపల్లి మండలాలకు చెందిన ప్రజలకు ఇసుక అందజేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇసుక కావాల్సిన వారు మీ సేవకు వెళ్లి ఎన్ని ట్రాక్టర్ల ఇసుక కావాలో దరఖాస్తు చేసుకుంటే ఇసుక ఇంటికి చేరుతుందన్నారు. అయితే ఇసుక సరఫరా చేసే ట్రాక్టర్ యజమానులు 15వేల రూపాయలు ముందుగా మైనింగ్ ఏడీ పేరా డిపాజిట్ చేయాలని తహసీల్దార్ సూచించారు. మైనింగ్ సిబ్బంది వినోద్, శ్రీకాంత్ ఉన్నారు.

దాహం తీర్చుకోవడానికి వెళ్లి బావిలో గల్లంతైన వ్యక్తి

పెంట్లవెల్లి, జనవరి 24 : దాహం తీర్చుకోవడానికి వెళ్లి బావిలో వ్యక్తి గల్లంతైన సంఘటన నాగర్‌కర్నూల్‌జిల్లా పెంట్లవెల్లి మండల పరిధిలోని కొండూరు గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన కథనం ప్రకారం... కొండూరు గ్రామానికి చెందిన కుర్వ కుర్మయ్య మంగళవారం మధ్యాహ్నం నీళ్ల తాగడానికి వ్యవసాయ పొలం సమీపంలో ఉన్న బావి దగ్గరికి వెళ్లారు. తనకు ఈత రాకపోవడంతో కాలు జారి బావిలో గల్లంతయ్యాడు. గమనించిన గ్రామస్తులు బావిలో చనిపోయిన వ్యక్తిని తీయడానికి మోటార్ల ద్వారా నీటిని బయటకు పంపించి రాత్రి బయటకు తీశారు. ఈ సంఘటనపై ఎస్ఐని వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు